

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 10 సంచిక : 81 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ సోమవారం 23 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :81 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : KAKINADA MON 23 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

- వికారాబాద్ జిల్లాలో ఆటోను ఢీకొట్టిన లారీ
- ఆటోలోని నలుగురు అక్కడికక్కడే మృతి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తింపు

- మిగతా 2లో

భారత వైవిధ్యానికి పుతిన్ ఫిదా..

ఇతర దేశాలకు ఆదర్శమంటూ ప్రశంసలు!



పెన్ పవర్ డెస్క్:భారత్‌లో భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ ప్రజలంతా ఐక్యంగా జీవిస్తున్న తీరు ప్రపంచ దేశాలకు ఆదర్శమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. భారతీయ నాగరికత, సంప్రదాయాలు ఎంతో ప్రత్యేకమైనవని కొనియాడారు. దేశంలోని భాషా వైవిధ్యం తనను

- మిగతా 2లో

ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి..

ప్రత్యేక టీషర్ట్‌ల ఆవిష్కరణ

- ప్రభాస్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానం
- 'హైదరాబాద్ వాక్స్' ప్రచార టీషర్ట్‌లను ఆవిష్కరించిన ప్రభాస్
- మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం గళమెత్తాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాల్సిందిగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నేడు ప్రభాస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్ లో ప్రభాస్ నివాసానికి వెళ్లిన ఆయన.. కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా నిర్వహిస్తున్న డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగంపై

- మిగతా 2లో



యలహంక ప్యాలెస్ కు వెళ్లకుండా షర్మిలను అడ్డుకున్న పోలీసులు...

- బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద వైఎస్ షర్మిల కాన్వాయ్ అడ్డగింత
- ఎలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశం లేదంటూ పోలీసుల స్పష్టీకరణ
- కోర్టు ఆదేశాల నేపథ్యంలో నగరంలోని హోటల్‌కు షర్మిల తరలింపు
- ప్యాలెస్ లీజు వివాదంపై కోర్టును ఆశ్రయించిన సిలికాన్ బిల్డర్స్
- కేసు తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసిన కోర్టు

పెన్ పవర్ డెస్క్:బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. కుటుంబ సమేతంగా నగరానికి చేరుకున్న ఆమెను జగన్ నివాసం ఉంటున్న యలహంక ప్యాలెస్ వైపు వెళ్లకుండా పోలీసులు నిలువరించారు. న్యాయస్థానం ఆదేశాలు ఉన్నందున ప్యాలెస్‌లోకి ప్రవేశించడానికి అనుమతి లేదని స్పష్టం చేస్తూ, ఆమె కాన్వాయ్‌ను దారిమళ్లించారు. ఈ క్రమంలో విమానాశ్రయం వెలుపల పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కుటుంబంలో జరగనున్న వివాహ ఏర్పాట్లకు సంబంధించి

- మిగతా 2లో



పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు: సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- పొలిట్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- స్థానిక సంస్థల ఫలితాలు ప్రజాభిప్రాయానికి నిదర్శనమన్న సీఎం చంద్రబాబు
- పంచాయతీల్లో, ఏకగ్రీవాల కోసం గ్రామ నేతలతో మాట్లాడాలని ఎమ్మెల్యేలకు సూచన
- ఏకగ్రీవ పంచాయతీలకు జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- పొలిట్ నేతల మధ్య పంతాలు వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పొలిట్ నేతలు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పొలిట్ ముఖ్యనేతలు, మంత్రులతో తాజాగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇటీవల పొలిట్ గుర్తులపై జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఏకపక్ష ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. పొలిట్ ప్రాతిపదికన జరిగిన పోరు ముగిసిందని, ఇక గ్రామాల్లో అభివృద్ధి ధ్యేయంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అదే విజయ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పంచాయతీలు పొలిట్ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి అక్కడ రాజకీయ ఘర్షణలకు తావులేకుండా ఏకగ్రీవాలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక నజరానాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గతంలో కనీస నజరానా రూ.5 లక్షలుగా ఉంటే దానిని ఇప్పుడు రూ.15 లక్షలకు, గరిష్ఠ నజరానాను రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షల ప్రోత్సాహకం అందుతుందని ఆయన గుర్తుచేశారు.

గ్రామ స్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్ర పట్టుదలతో ఉంటారని, అటువంటి చోట్ల నేతలతో సంప్రదింపులు జరపాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రత్యర్థి పార్టీ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో తమ పార్టీలోని నేతలే రెండు వర్గాలుగా విడిపోయి పోటీపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే మార్గమని ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



భారత్‌కు నేపాల్ ప్రధాని బలేంద్ర షా..

నేడు మోదీతో కీలక భేటీ!

పెన్ పవర్ డెస్క్: భారత్, నేపాల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. నేపాల్ ప్రధానమంత్రి బలేంద్ర షా రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం

- మిగతా 2లో



గుజరాత్‌లో ఘోర ప్రమాదం.. ఒకే కారులో ఏడుగురు దుర్మరణం!

పెన్ పవర్ డెస్క్:: గుజరాత్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన ట్రక్కు కారును ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు భారత సైనికులు, ముగ్గురు

- మిగతా 2లో

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..

ఎవరైనా పోటీ చేయవచ్చు

- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ప్రకటన
- పొలిట్ శ్రేణులు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేయవచ్చని స్పష్టీకరణ
- పోటీ చేయాలనుకునే వారిని నాయకులు ఎవరూ అడ్డుకోవద్దని ఆదేశం
- పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని వెల్లడి
- స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్నికలు జరగాలని పిలుపు



- మిగతా 2లో



జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

- ఐఐటీలతో సమానంగా ఐటీఐలకు గుర్తింపు దక్కాలన్న లోకేశ్
- ప్రధాని మోదీ పోస్టుకు ఏపీ విద్యాశాఖ మంత్రి మద్దతు
- ఏఐ కాలంలో టెక్నికల్ నైపుణ్యాలకే అధిక విలువ
- జర్మనీ పరిశ్రమల అనుభవాన్ని ప్రస్తావించిన లోకేశ్
- వృత్తి విద్యపై సమాజంలో ఉన్న భావన మారాలన్న పిలుపు

- మిగతా 2లో

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా భారత్ ముందడుగు

- అంతరిక్షంలో సరికొత్త ఔషధాల అభివృద్ధిపై దృష్టి సారించిన భారత్
- మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో ప్రోటీన్ క్రిస్టల్స్ పెరుగుదలపై శాస్త్రవేత్తల పరిశోధనలు
- బెంగళూరు టెక్ సమ్మిట్‌లో స్పేస్ ఫార్మా అవకాశాలపై విస్తృత చర్చ
- అంతరిక్ష సాంకేతికతతో కొత్త ఔషధాల రూపకల్పన సాధ్యమన్న కిరణ్ మజుందార్ షా
- 2035 నాటికి సిద్ధం కానున్న భారతీయ అంతరిక్ష కేంద్రం

- మిగతా 2లో





ఏపీలో డిసెంబర్ పింఛన్లు ముందుగానే..

- నవంబర్ 30 మరియు డిసెంబర్ 1 తేదీల్లోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- డిసెంబర్ 2న పంచాయతీ పోలింగ్ ఉన్నందున ముందస్తు చెల్లింపులకు నిర్ణయం
- నవంబర్ నెల పింఛను తీసుకోని వారికి కలిపి రూ.8,000 చెల్లింపు
- ఎన్ఎస్ఏపీ లబ్ధిదారులకు కేంద్ర వాటా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ
- కొత్తగా దరఖాస్తు చేసుకున్న 13 లక్షల మంది వివరాల పరిశీలన త్వరలోనే పూర్తి

- మిగతా 2లో



జగన్ అంతకు మించి చేయలేరా ?

ఏపీలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార కూటమి అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్ జగన్ ఆరోపిస్తున్నారు. నామినేషన్ల అడ్డంకులు, రిగ్గింగ్‌పై ఎన్నికల సంఘం, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా.. సోషల్ మీడియా విమర్శలకే పరిమితమవుతున్నారనే చర్చ సాగుతోంది. ఢిల్లీ వెళ్లి జాతీయ మీడియా, ఇతర పార్టీల మద్దతుతో పోరాటం చేస్తే వైసీపీ వాదనకు మరింత ప్రచారం లభించేదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.
వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ గత కొన్ని రోజులుగా ఒకే రకమైన తీరున మాట్లాడుతున్నారు. అఫ్ కోర్స్ ఆయన మాట్లాడిన దాంట్లో వాస్తవాలు కూడా ఉన్నాయనుకోండి. కానీ అదే పనిగా ఆయన తన ఆవేదన కానీ ఆందోళన కానీ వ్యక్తం చేయడం వల్ల ఉపయోగం ఏమిటో వైసీపీ వారికే తెలియాలి. ఇంతకీ చెప్పొచ్చేది ఏంటి అంటే వైసీపీని నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికలు జరిగే దాకా కూడా అధికార కూటమి అడుగడుగునా ఇబ్బంది పెడుతోంది అని. ఫైర్ అండ్ ఫ్రీగా ఏపీలో స్థానిక ఎన్నికలు జరగడం లేదని. వైసీపీ వారు నామినేషన్లు దాఖలు చేస్తే వాటిని చింపేస్తున్నారు అని, అలాగే పోలింగ్ దగ్గర రిగ్గింగ్ చేస్తున్నారు అని, అధికార బలాన్ని అడుగడుగునా చూపిస్తున్నారు అని జగన్ ఆరోపణలు. ఆయన లేటెస్ట్ గా మరోసారి ఇదే విషయాలను ట్వీట్ రూపంలో చెప్పుకొచ్చారు.

వేదన అరణ్య రోదన :

జగన్ ఈ తరహా విమర్శలు కానీ ఆరోపణలు కానీ చేయడం వల్ల ఉపయోగం ఏమిటి అన్నది ఇక్కడ ప్రధానంగా చర్చ సాగుతోంది. అధికార పార్టీ దౌర్జన్యాలు చేస్తోంది అని జగన్ ఆరోపించారు. ఇప్పటికే ఆయన ఎన్నికల సంఘాన్ని కలసి ఫిర్యాదు చేశారు. గవర్నర్ ని కూడా కలసి వచ్చారు. ఆయన పార్టీ నాయకులు కూడా ఇదే విషయం మీద తాజాగా మరోసారి గవర్నర్ కి ఫిర్యాదు చేశారు. జగన్ అయితే ట్వీట్లు వేస్తూ ప్రజా స్వామ్యం ఖూనీ అవుతోంది అని అంటున్నారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగడం లేదు అని అంటున్నారు. కానీ ఇదంతా అరణ్య రోదన గానే మిగిలిపోతోంది అని అంటున్నారు. ఎందువల్ల అంటే వైసీపీ న్యాయ పోరాటాలు చేసినా మరోటి చేసినా ఏపీలో కూటమి వ్యూహాత్మకంగా చేయాల్సింది చేస్తోంది. అలాంటపుడు దీనికి ఇతర మార్గాలను కూడా ఆలోచించాలి కదా అన్న చర్చ సాగుతోంది.

జాతీయ దృష్టికి :

ఏపీలో ఏమి జరుగుతోంది అన్నది జాతీయ మీడియా దృష్టికి తేవడమో లేకపోతే జగన్ ఢిల్లీ వెళ్ళి అక్కడ భావ సారూప్యత కలిగిన పార్టీలతో కలిసి ఆందోళన నిర్వహించడమో చేయడం ద్వారా జాతీయ దృష్టిని ఆకట్టుకునే ప్రయత్నం చేసి ఉంటే ఎంతో కొంత వైసీపీకి మైలేజ్ దక్కేది అని అంటున్నారు. అంతే కాదు వైసీపీ చేస్తున్న వాదన ఢిల్లీ దాకా వినిపించేది అని కూటమిని అలా ఎక్స్ పోజ్ చేసేందుకు వీలు అయ్యేది అని అంటున్నారు. నిజానికి చూస్తే ఏపీలో జరుగుతున్న పరిణామాలు జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న బీజేపీకి తెలియనివి కావు అన్నది కూడా ఉంది. కానీ ఢిల్లీ వేదికగా చేసుకుని నిరసనలు కానీ ఏదైనా ఆందోళనలు కానీ చేసిన పక్షంలో ఎన్డీయేకి వ్యతిరేకంగా ఉండే పార్టీల నుంచి అయినా మద్దతు దొరికి ఆ మేరకు ఎన్డీయే మీద జాతీయ స్థాయిలో ఏపీలోనూ ఒత్తిడి పెరిగేది కదా అన్నది కూడా రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి.

రోటీన్ గానే అంతా :

కానీ జగన్ అయితే రొటీన్ గా ట్వీట్లు పెడుతూనే అధికార కూటమి మీద సోషల్ మీడియా వేదికగానే యుద్ధం చేస్తున్నారు అని అంటున్నారు. పులివెందులలో ఎన్నికలు సందర్భంగా జగన్ నిరసన చేశారు. అది బాగా హైలెట్ అయింది. మళ్ళీ ఆ స్థాయిలో వైసీపీ నుంచి పోరాట స్ఫూర్తి లేకుండా పోయింది అని అంటున్నారు. అంతే కాదు నేషనల్ మీడియాతో ఇంటరాక్ట్ అవుతూ ఎప్పటికప్పుడు ఏపీలో జరుగుతున్న రాజకీయం మీద పరిణామాల మీద జగన్ ఇంటర్వ్యూలు ఇస్తూ ఉంటే కూడా ఏపీలో కూటమి మీద అది ఒత్తిడి పెంచేదిగా ఉండేదని అంటున్నారు. పొరుగున ఉన్న కేటీఆర్ అయితే వివిధ నేషనల్ ఫ్లాట్ ఫారాలను ఎంచుకుని అక్కడ డిబేట్లకు హాజరవుతున్నారు. ఇంటరాక్ట్ అవుతున్నారు. వైసీపీ అధినేత మాత్రం ట్వీట్లతో సరిపెడుతున్నారు అన్న చర్చ అయితే సాగుతోంది. జగన్ అంటే ఫైర్ బ్రాండ్ అని 2014 నుని 2019 దాకా ఆయన డైనమిక్ లీడర్ షిప్ ని చూసిన వారు అనే మాట. ఆనాడు ఆయన ఢిల్లీ దాకా వెళ్ళి మరీ ఆందోళనలు చేశారు. మరి ఇపుడు అయితే అలాంటిది ఏదీ లేదని కూడా చర్చ అయితే సాగుతోంది. మరి వైసీపీ ఆలోచనలు వ్యూహాలు ఏమిటో చూడాల్సి ఉంది.

భారత్‌కు నేపాల్ ప్రధాని బలేంద్ర షా.. నేడు మోదీతో కీలక భేటీ!

- మొదటి పేజీ తరువాయి

మేరకు ఆయన ఈ పర్యటనకు వచ్చారు.న్యూఢిల్లీలోని విమానాశ్రయంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బలేంద్ర షాకు స్వాగతం పలికారు. ఆయన వెంట నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే, విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా భారత్‌కు వచ్చారు.ఈ పర్యటనలో భాగంగా సోమవారం (నవంబర్ 23) ప్రధాని నరేంద్ర మోదీతో బలేంద్ర షా ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రవాణా, మౌలిక సదుపాయాలు, ఇంధనం, జలవనరుల సహకారంపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.లాగే ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతోనూ బలేంద్ర షా భేటీ కానున్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆదివారం ఆయనతో సమావేశమయ్యారు.మార్చి 2026లో నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బలేంద్ర షా తొలిసారిగా భారత్‌లో పర్యటిస్తున్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన చేపట్టిన తొలి ద్వైపాక్షిక విదేశీ పర్యటన కూడా ఇదే కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో భారత్, నేపాల్ మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఇరు దేశాలు ఆశిస్తున్నాయి.

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..

ఎవరైనా పోటీ చేయవచ్చు

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలవవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చే జనసేన శ్రేణులను పార్టీలోని నాయకులు ఎవరూ అడ్డుకోకూడదని పవన్ కల్యాణ్ కరాఖండిగా ఆదేశాలు జారీ చేశారు. స్థానిక స్థాయిలో ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, ప్రజల మద్దతు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు.

మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి స్థానాల పంపకాలు (సీట్ల సర్దుబాటు) ఉండవని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగే ఎన్నికలని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునే ప్రతి పౌరుడికి నామినేషన్ దాఖలు చేసే పూర్తి హక్కు ఉంటుందన్నారు.
జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.

ఏపీలో డిసెంబర్ పింఛన్లు ముందుగానే..

ఆంధ్రప్రదేశ్‌లోని 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ల మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన ప్రారంభమయ్యే ఈ పంపిణీ ప్రక్రియను, ఈసారి నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీల్లోనే పూర్తి చేయాలని యంత్రాంగం నిర్ణయించింది.రాష్ట్రంలో డిసెంబర్ 2వ తేదీన పంచాయతీ ఎన్నికల మూడో విడత పోలింగ్ జరగనుంది. ఆ సమయంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది అంతా పూర్తిగా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారు. దీనివల్ల పింఛన్ల పంపిణీలో ఎటువంటి జాప్యం లేదా ఆటంకాలు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ముందస్తు పంపిణీ నిర్ణయాన్ని తీసుకుంది. గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలోనూ నవంబర్ పింఛన్లను అక్టోబర్ 30వ తేదీనే అందజేసిన విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ పింఛన్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.2,774 కోట్ల నిధులను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి నగదు రూపంలో పింఛన్లను అందజేస్తారు. అలాగే, గత నెలలో వివిధ వ్యక్తిగత కారణాల వల్ల నవంబర్ పింఛన్ తీసుకోలేకపోయిన లబ్ధిదారులకు, ఈ నెల మొత్తంతో కలిపి ఒకేసారి రూ.8,000 అందజేయనున్నారు.కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద ఉన్న సుమారు 9.34 లక్షల మంది లబ్ధిదారులకు కేంద్ర వాటా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. వీరంతా తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ అయిందో లేదో ఒకసారి సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కేంద్ర వాటా బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లగా, మిగిలిన మొత్తాన్ని సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదుగా అందిస్తారు.మరోవైపు, కొత్త పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే, డిసెంబర్ నెలలోనే ఈ దరఖాస్తులపై ప్రత్యేక విచారణ జరపనున్నారు. నిర్దేశిత ఏడు దశల అర్హత ప్రమాణాల (సెవెన్ స్టెప్ వెరిఫికేషన్) ప్రకారం పూర్తిస్థాయిలో తనిఖీలు చేసిన తర్వాతే అర్హులను ఎంపిక చేస్తారు. ఈ నిబంధనలకు లోబడి ఎంపికైన అర్హులకు వచ్చే ఏడాది జనవరి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

ఐఐటీ విద్యార్థులతో సమానంగా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) విద్యార్థులకూ సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టుకు లోకేశ్ స్పందిస్తూ, ఈ ముఖ్యమైన విషయాన్ని లేవనెత్తినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శకంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఫ్యాక్టరీ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగావకాశాలు, ప్రాధాన్యత భారీగా పెరుగుతాయని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను యువకుడిగా ఉన్నప్పుడు జర్మనీలోని ఆటోమొబైల్ ఫ్యాక్టరీలలో ఇంటర్న్‌షిప్ చేశాను. అక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంతగా గౌరవిస్తారో నేను స్వయంగా చూశాను. ఆ నైపుణ్యాలకు ఇచ్చే గౌరవమే జర్మనీ ప్రపంచంలోనే అత్యుత్తమ తయారీ రంగ కేంద్రంగా ఎదగడానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో కూడా ఐటీఐలపై ఉన్న చిన్నచూపును తొలగించి, నైపుణ్యంతో కూడిన పనులపై గౌరవమర్యాదలు తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని లోకేశ్ వివరించారు.రాబోయే రోజుల్లో తయారీ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. సాధారణ విద్యా కోర్సులతో సమానంగా వృత్తి విద్యా కోర్సులకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఐటీఐ విద్యార్థుల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం ఏర్పడినప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తమ వృత్తి పట్ల వారు మరింత గర్వపడే వాతావరణం ఏర్పడుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా భారత్ ముందడుగు

భారతదేశం తన విస్తరిస్తున్న అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను ఫార్మా రంగంతో అనుసంధానించి, సరికొత్త ఔషధాల ఆవిష్కరణకు మార్గం సుగమం చేస్తోంది. అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (భార రహిత స్థితి) వాతావరణాన్ని వినియోగించుకుని నెక్స్ట్ జనరేషన్ మందులను ఎలా అభివృద్ధి చేయవచ్చనే అంశంపై భారత శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ కంపెనీలు, స్టార్టప్‌లు ముమ్మరంగా దృష్టి సారిస్తున్నాయి.
ఇటీవల నవంబర్ 19న ముగిసిన బెంగళూరు టెక్ సమ్మిట్‌లో అంతరిక్షంలో ఔషధాల తయారీ, ప్రయోగాల నిర్వహణపై కీలక చర్చ జరిగింది. భవిష్యత్తులో దేశం నిర్మించనున్న అంతరిక్ష మౌలిక సదుపాయాలు బయోటెక్నాలజీ పరిశోధనలకు ఎలా ఉపయోగపడతాయనే విషయాన్ని పరిశోధకులు, విధాన రూపకర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విస్తృతంగా పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా సరసమైన ధరలకే నాణ్యమైన మందులు, టీకాలను సరఫరా చేస్తూ 'ప్రపంచ ఫార్మసీ'గా గుర్తింపు పొందిన భారత్, ఇప్పుడు తన ఔషధ తయారీ శక్తిని అంతరిక్ష ప్రయోగాలతో కలపాలని భావిస్తోంది.భూమిపై గురుత్వాకర్షణ శక్తి కారణంగా ప్రోటీన్ క్రిస్టల్స్ ఏర్పడే తీరుపై ప్రభావం పడుతుంది. అదే అంతరిక్షంలోని దాదాపు భార రహిత వాతావరణంలో ఈ క్రిస్టల్స్ అత్యంత సమతుల్యంగా పెరుగుతాయి. దీనివల్ల ప్రోటీన్ల నిర్మాణాన్ని శాస్త్రవేత్తలు లోతుగా అధ్యయనం చేయడానికి వీలవుతుంది. ఈ పరిశీలనలు ఔషధ సూత్రీకరణలను మెరుగుపరచడమే కాకుండా, కొత్త చికిత్సా పద్ధతుల అభివృద్ధిని వేగవంతం చేస్తాయని నిపుణులు వివరిస్తున్నారు.ప్రముఖ బయోఫార్మాస్యూటికల్ సంస్థ బయోకాన్ కూడా అంతరిక్ష ఆధారిత పరిశోధనలపై ఎంతో ఆసక్తి చూపిస్తోంది. స్పేస్ టెక్నాలజీల ద్వారా అణు నిర్మాణాలను మార్చవచ్చని, తద్వారా కొత్త మేధో సంపత్తి (ఐపీ), సరికొత్త అణువులు, మెరుగైన సామర్థ్యం కలిగిన ఔషధాలను రూపొందించవచ్చని బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షా పేర్కొన్నారు.
ప్రస్తుతం సేవలందిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కాలపరిమితి 2030 నాటికి ముగిసే అవకాశం ఉండటంతో, ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు వాణిజ్య అంతరిక్ష ప్రయోగశాలల ఏర్పాటుపై దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలో భారత్ 2035 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న 'భారతీయ అంతరిక్ష కేంద్రం' అంతర్జాతీయ బయోటెక్నాలజీ, ఫార్మా పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. అయితే శాశ్వత అంతరిక్ష కేంద్రం అందుబాటులోకి వచ్చేలోపే మైక్రోగ్రావిటీ ప్రయోగాలను ప్రారంభించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

భారత వైవిధ్యానికి పుతిన్ ఫిదా..

- మొదటి పేజీ తరువాయి

ఎంతగానో ఆశ్చర్యపరిచిందని పేర్కొన్నారు. సెర్బియాకు చెందిన ప్రముఖ చిత్ర దర్శకుడు, రచయిత ఎమిర్ కుస్తురికాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ భారత్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన సంభాషణను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.భారత్‌లో ఎంతమంది ప్రజలు హిందీ మాట్లాడుతున్నారని మోదీని అడిగినట్లు పుతిన్ వెల్లడించారు. దేశంలో సుమారు 60 కోట్ల మంది హిందీ మాట్లాడుతున్నారని ప్రధాని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. భారత్ మొత్తం జనాభా ఎంత అని అడగ్గా దాదాపు 150 కోట్లు అని చెప్పినట్లు వివరించారు.
అంటే దేశ జనాభాలో మూడింట ఒక వంతు మంది మాత్రమే హిందీ మాట్లాడుతుండగా, మిగిలిన వారు వివిధ ప్రాంతీయ భాషల్లో మాట్లాడుతున్నారని పుతిన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇన్ని భాషలు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ ప్రజలంతా కలిసి జీవించడం అద్భుతమని వ్యాఖ్యానించారు.
భారతీయ నాగరికత ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన నాగరికతల్లో ఒకటని పుతిన్ పేర్కొన్నారు. భారత్ గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే అంతగా ఆసక్తి పెరుగుతోందని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న భారతదేశం ఇతర దేశాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లాలోని బుగ్గ రామేశ్వరం వద్ద వేగంగా వచ్చిన ఓ లారీ, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నగేష్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని, పెండ్లిముడుగు గ్రామం నుంచి పనుల నిమిత్తం కేరెళ్లికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. మలుపు వద్ద లారీ అతివేగంగా, అజాగ్రత్తగా రావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యలహంక ప్యాలెస్ కు వెళ్లకుండా షర్మిలను అడ్డుకున్న పోలీసులు...

- మొదటి పేజీ తరువాయి

షర్మిల తన తల్లి వైఎస్ విజయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి బెంగళూరు చేరుకున్నారు. అయితే విమానాశ్రయం నుంచి వాహనాల్లో బయలుదేరిన వెంటనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. యలహంక వైపు వెళ్లే మార్గాన్ని కాదని, వాహనాలను బెంగళూరు నగరం వైపు మళ్లించారు. కోర్టు ఆదేశాలను పాటించాలని సూచిస్తూ ఆమెను నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌కు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విమానాశ్రయంతో పాటు యలహంక ప్యాలెస్ పరిసరాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ వివాదం వెనుక న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. షర్మిల పర్యటన నేపథ్యంలో, జగన్ వర్గం తరఫున సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి భీమిశెట్టి రమేశ్ బాబు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలను పరిశీలించిన న్యాయస్థానం.. వైఎస్ షర్మిల గానీ, ఆమె అనుచరులు గానీ యలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశించకూడదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో భాగంగానే పోలీసులు విమానాశ్రయం వద్ద షర్మిలను అడ్డుకుని వెనక్కి పంపారు.

ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి.. ప్రత్యేక టీషర్ట్‌ల ఆవిష్కరణ

- మొదటి పేజీ తరువాయి

అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభాస్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంయుక్తంగా 'హైదరాబాద్ వాక్స్ - నషా ముక్త్ భారత్' (Hyderabad Walks -- Nasha Mukt Bharat) కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక టీషర్ట్‌లను ఆవిష్కరించారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలనే ప్రధాన సందేశాన్ని ఈ ప్రచారం చాటిచెబుతోంది. ఈ సందర్భంగా "మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం మనమందరం గళమెత్తుదాం!" అంటూ పిలుపునిచ్చారు. యువతలో విపరీతమైన అభిమానం ఉన్న ప్రభాస్ వంటి అగ్ర నటుడు ఈ అవగాహన ఉద్యమానికి మద్దతు తెలపడం ద్వారా సమాజంలో మరింత సానుకూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

గుజరాత్‌లో ఘోర ప్రమాదం.. ఒకే కారులో

ఏడుగురు దుర్మరణం!

- మొదటి పేజీ తరువాయి

చిన్నారులు ఉండటం కలచివేసింది.గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భుజ్-ఖావ్డా జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ ప్రాంతానికి చెందిన రెండు కుటుంబాలు గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్‌ను సందర్శించి తిరిగి భుజ్‌కు వెళున్నాయి.ఈ క్రమంలో ఖావ్డా నుంచి భుజ్ వైపు వెళ్తున్న హ్యుందాయ్ ఆరా కారును ఎదురుగా వచ్చిన ట్రైలర్ ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి కారు తీవ్రంగా దెబ్బతిని నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భుజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సైనికులు, వారి భార్యలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మూడునెలల పసికందు కూడా ఈ ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా ధ్వంసం కావడంతో మృతదేహాలను బయటకు తీయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రమాదంపై ఫోరెన్సిక్ బృందం పరిశీలన జరిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సైతం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.

సీనియర్ పాత్రికేయుడు భూమి శ్రీనుకు పితృవియోగం



ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 22:సీనియర్ పత్రికా విలేఖరి చెల్లబోయిన శ్రీనివాస్ (భూమి శ్రీను) తండ్రి చెల్లబోయిన అప్పారావు (90) అనారోగ్యంతో కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. అప్పారావు గారికి నలుగురు సంతానం. ఆయన మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. తండ్రి మరణవార్తతో భూమి శ్రీను కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అప్పారావు మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పాత్రికేయులు, ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భూమి శ్రీనును పరామర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

ర్యాలిలో తాగునీటి సమస్యపై మహిళల ఆవేదన

సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఎర్రగా వస్తున్న కుళాయి నీరు.. ఎన్నికల అనంతరం సమస్య పరిష్కారానికి కూటమి నాయకుల హామీ



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 22 ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పంచాయతీ ఎన్నికల ప్రచార వేళ స్థానిక సమస్యలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం పరిసర ప్రాంతంలో నివసిస్తున్న మహిళలు తాగునీటి సమస్యపై స్థానిక నాయకుల దృష్టికి తీసుకువచ్చి తమ ఇబ్బందులను వివరించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు ఎర్రటి రంగులో వస్తుండటంతో తాగడానికి, వంట చేసుకోవడానికి పనికిరాని పరిస్థితి నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.రోజువారీ అవసరాలకు నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితుల్లో సరఫరా అవుతున్న నీటి నాణ్యత సరిగా లేకపోవడం తమకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని తెలిపారు. నీటిని వినియోగించుకునే విషయంలో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని, తాగునీటి సమస్యను అధికారులు తక్షణమే పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్న నాయకులకు తమ సమస్యను వివరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.మహిళలు తెలిపిన సమస్యను గ్రామ మాజీ సర్పంచ్ పెంచర్ల పుల్లంరాజు వర్మ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సరఫరా పరిస్థితిని తెలుసుకుని మహిళల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన వెంటనే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని, సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, పారిశుధ్యం, రహదారులు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న, జడ్పీటీసీ గుడపాటి శ్రీనివాసు, ఎంపీటీసీ-2 మెర్ల గంగారాం, ఎంపీటీసీ-3 అత్తిలి రామలక్ష్మి వెంకట్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా ముదునూరి సీతారామరాజు నామినేషన్

- **నామినేషన్ కార్యక్రమానికి హాజరైన వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు**
- **ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు**

కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, నవంబర్, 22:కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది. ధర్మవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైసీపీ బలపరిచిన అభ్యర్థిగా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు సోదరుడు ముదునూరి సీతారామరాజు ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు హాజరై అభ్యర్థికి సంఘీభావం తెలిపారు. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు సోదరుడైన ముదునూరి సీతారామరాజుకు మద్దతుగా మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం, నాయకుల మద్దతు మధ్య నామినేషన్ కార్యక్రమం సందడిగా సాగింది. డిసెంబర్ 2 న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ధర్మవరం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధర్మవరం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా పుణ్యమంతుల గోవిందరాజులు నామినేషన్.

- **నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**
- **భారీగా తరలివచ్చిన గ్రామ ప్రజలు, కూటమి శ్రేణులు.**



కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్, 22:కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పుణ్యమంతుల గోవిందరాజులు (రాజా) నామినేషన్ కార్యక్రమం అత్తహసంగా నిర్వహించారు.అభ్యర్థికి మద్దతుగా గ్రామ ప్రజలు, అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ధర్మవరంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా హాజరై సర్పంచ్ అభ్యర్థి పుణ్యమంతుల గోవిందరాజులు (రాజా)కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ కూటమి అభ్యర్థి పుణ్యమంతుల రాజా విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ధర్మవరంలో కూటమి గెలుపే లక్ష్యంగా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి పుణ్యమంతుల రాజా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల ఆదరణ, ఆశీస్సులతో విజయం సాధించి ధర్మవరం గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుణ్యమంతుల శ్రీను, పుణ్యమంతుల రవి, మీసాల రాజు, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్న అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగువానిలంకలో ఈ నెల 26న ధనలక్ష్మి

అమ్మవారి మహా అన్నసమారాధన

ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 22:కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలమూరు మండలం బడుగువానిలంకలోని శ్రీ ధనలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఈ నెల 26వ తేదీ గురువారం మహా అన్నసమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బడుగువానిలంక నాలుగు రోడ్ల కూడలి సమీపంలో తమ్మన రత్తయ్యకు చెందిన పచ్చని పంట పొలాల్లో కొలువైన అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ మహా అన్నసమారాధనను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ రైతులు, భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. కార్యక్రమానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారు. మహిళలకు ప్రత్యేక భోజన వసతితో పాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆటోలను కూడా ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.బడుగువానిలంకతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో



కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించి, శ్రీ ధనలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

గెద్దనాపల్లి సర్పంచ్ అభ్యర్థి ఇనకోటి గంగాధర్ జోరుగా ఎన్నికల ప్రచారం.

-ప్రజలు అవకాశమిస్తే గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా.



కిర్లంపూడి పెన్ పవర్ నవంబర్ 22: గ్రామ ప్రజలు అవకాశం ఇస్తే గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి,విద్యా సంస్థల అధినేత ఇనకోటి గంగాధర్ తెలిపారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంగాధర్ ఆదివారం జోరుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.పలువురు గ్రామ పెద్దలతో కలసి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఇనకోటి గంగాధర్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గా ప్రజలు తనకు అవకాశమివ్వాలని, అవకాశం ఇస్తే గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ప్రచారంలో గ్రామానికి చెందిన పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కట్టుబడిన నాయకత్వాన్ని ప్రోత్సహించడమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ లక్ష్యం.





-ప్రజాస్వామ్య ఉద్యమ పరిరక్షణ ఉద్యమ నాయకురాలు డాక్టర్ అనూష యాదవ్.

కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 22: గ్రామాభివృద్ధికి కట్టుబడిన నాయకత్వాన్ని ప్రోత్సహించడమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం లక్ష్యమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ నాయకురాలు, తెలుగు మహిళా జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ అనూష యాదవ్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి సర్పంచ్ అభ్యర్థి ఏపూరి నాగమణి, ఏలూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి దాడిశెట్టి అనంత బాబ్జి నామినేషన్ ప్రక్రియలో పాల్గొని డాక్టర్ అనూష యాదవ్ సంఘీభావం తెలియజేసారు. వారికి పట్టు కండువాలతో సత్కరించి ప్రజల ఆశీస్సులతో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనూష యాదవ్ మాట్లాడుతూ డబ్బు, మద్యం, చీరలు, ఇతర ప్రలోభాలకు ఓటర్లు లొంగకుండా కులమతాలకు అతీతంగా గ్రామ అభివృద్ధిని కాంక్షించే నిజాయితీగల నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణాన్ని ప్రోత్సహించడం, ప్రజలకు జవాబుదారీగా ఉండే గ్రామ నాయకత్వాన్ని నిలబెట్టడం ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇదే లక్ష్యంతో ప్రతిపాడు నియోజకవర్గవ్యాప్తంగా సుమారు పది గ్రామాల్లో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వస్తున్న సర్పంచ్ అభ్యర్థులకు ఉద్యమం మద్దతుగా నిలుస్తోందని స్పష్టం చేశారు రాచపల్లి, పెద్దిపాలెం గ్రామాల్లో కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం తన మద్దతును ప్రకటిస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో నిన్ననే నామినేషన్లు దాఖలు చేసిన సర్పంచ్ అభ్యర్థులకు ఉద్యమం తరపున మద్దతు కొనసాగిస్తామని డాక్టర్ అనూష యాదవ్ వెల్లడించారు. ఆయా గ్రామాల్లో జరిగే నామినేషన్, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు కూడా స్వయంగా హాజరై అభ్యర్థులకు సంఘీభావం ఆమె తెలియజేయనున్నట్లు తెలిపారు.

అమలాపురం అభివృద్ధికి నల్ల శ్రీధర్ సారథ్యం!





- నేడు మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం
- డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారమే ప్రధాన లక్ష్యం
- తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- పార్టీలకతీతంగా అందరినీ కలుపుకుని అభివృద్ధి దిశగా అడుగులు
- నూతన చైర్మన్ పాలనపై పట్టణ ప్రజల్లో భారీ ఆశలు

స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అమలాపురం, నవంబర్ 22:అమలాపురం మున్సిపాలిటీ అభివృద్ధిలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టే దిశగా అడుగులు పడుతున్నాయి. జనసేన పార్టీకి చెందిన కూటమి నాయకుడు నల్ల శ్రీధర్ సోమవారం అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నిగర్వి వ్యక్తిత్వం, అందరినీ ఆప్యాయంగా పలకరించే స్వభావం, పార్టీలకతీతంగా ప్రజలతో మమేకమయ్యే నాయకత్వ లక్షణాలతో గుర్తింపు పొందిన శ్రీధర్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనుండటంతో పట్టణ ప్రజల్లో అభివృద్ధిపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జనసేన పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అతిథుల కోసం ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారమే తొలి ప్రాధాన్యం!

అమలాపురం పట్టణ ప్రజలను ఏళ్ల తరబడి వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం నూతన చైర్మన్ ముందున్న ప్రధాన సవాల్‌గా నిలవనుంది. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ సమస్య పరిష్కారంపై శ్రీధర్ ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

తాగునీరు, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి!

పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య, అధ్వానంగా మారిన అంతర్గత రహదారులు, వర్షపు నీటి నిల్వలు, పారిశుద్ధ్య లోపాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయమవుతున్న పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మౌలిక వసతుల మెరుగుదలకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

అందరినీ కలుపుకుని అభివృద్ధి బాటలో!

రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డుల కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేయడం నూతన చైర్మన్ ముందున్న కీలక బాధ్యత. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పట్టణవాసులు ఆశిస్తున్నారు.మంచి మనసున్న వ్యక్తిగా, వివాదాలకు దూరంగా ఉండే నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న నల్ల శ్రీధర్ తన నాయకత్వంలో అమలాపురాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆయన అభిమానులు, అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపించగలిగితే మున్సిపల్ చైర్మన్‌గా శ్రీధర్ తనదైన ముద్ర వేసే అవకాశం ఉంది. పట్టణ ప్రజల చిరకాల సమస్యలకు పరిష్కారం చూపడంలో నూతన పాలకవర్గం ఎంతవరకు సఫలమవుతుందో వేచి చూడాలి.

డబ్బు పంపిణీకి దూరం.. ప్రలోభాలకు స్వస్తి

- దేవుడి సాక్షిగా ప్రమాణం చేసిన ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు
- ఓటర్లకు నగదు పంచబోమంటూ రామాలయంలో ప్రతిజ్ఞ
- డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయబోమని స్పష్టీకరణ
- సేవా దృక్పథం, గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని ప్రకటన



పెన్ పవర్ బ్యూరో కోనసీమ (రాజోలు) నవంబర్, 22:ఎన్నికలంటేనే డబ్బు పంపిణీ, ప్రలోభాలు, ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు కనిపిస్తున్న ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచబోమని, ఎలాంటి ప్రలోభాలకు గురిచేయబోమని దేవుడి సాక్షిగా ప్రమాణం చేశారు. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయకుండా ప్రజల నమ్మకంతోనే ఎన్నికల బరిలో నిలుస్తామని ప్రకటించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లిలంకలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థులు రేపూరి వాసు, చల్లా నాగరాజు స్థానిక రామాలయంలో స్వామివారి సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లకు నగదు పంపిణీ చేయబోమని, డబ్బు, ఇతర ప్రలోభాలతో ఓట్లను అభ్యర్థించబోమని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, దానిని డబ్బుతో కొనుగోలు చేయడం సరైన పద్ధతి కాదని తమ నిర్ణయం ద్వారా సందేశమిచ్చారు. సేవా దృక్పథంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ప్రజల మద్దతు కోరుతామని వెల్లడించారు.

ఎన్నికల్లో గెలుపే పరమావధిగా కాకుండా ప్రజల విశ్వాసాన్ని పొందడమే ముఖ్యమని, ప్రలోభాల రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని వారి ప్రతిజ్ఞ ద్వారా తెలియజేశారు.సాధారణంగా ఎన్నికల సమయంలో నగదు పంపిణీ, ఇతర ప్రలోభాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో సఖినేటిపల్లిలంకలో ఇద్దరు అభ్యర్థులు తీసుకున్న ఈ నిర్ణయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వీరి ప్రకటన ఇతర అభ్యర్థులు, గ్రామాల ప్రజల్లో ఎలాంటి చర్చకు దారితీస్తుందో వేచి చూడాలి.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

జగ్గంపేట ఎస్సై రఘునాథరావు



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 22 : వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు హెచ్చరించారు. ఆదివారం జగ్గంపేట సెంటర్లో వాహన తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులను నిలుపుదల చేసి సరైన రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులకు లైసెన్స్, ఆర్సి, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి వైసీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి.

- జగపతినగరం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాఠంశెట్టి సూర్యచంద్ర..
- సర్పంచ్ అభ్యర్థిగా మద్దాల ఆదిలక్ష్మి గణపతిని గెలిపించాలని ప్రజలకు వినతి.



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్,22: గ్రామాల అభివృద్ధికి,అభ్యున్నతికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను, వార్డు సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాఠంశెట్టి సూర్యచంద్ర ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన కిర్లంపూడిలో జగపతినగరం సర్పంచ్ అభ్యర్థిగా ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల ఇన్చార్జులు ముద్రగడ గిరిబాబు, తోట నరసింహం బలపరిచిన మద్దాల ఆదిలక్ష్మి గణపతి, వార్డు సభ్యులు శరకణం సంతోష్,చిక్కాల ప్రభావతి,మురా శ్రీను, బంగారు రమణలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఈ సందర్భంగా పాఠంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చిన్న హామీలను గాలికొదిలి ప్రజా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. గ్రామాల అభివృద్ధి చెందాలన్నా, కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, శరకణం భద్రం, ఆడారి బాబ్జి,పెనగంటి రాజేష్, వేగి రామకృష్ణ, మళ్ల నాగు, తూము చినబాబు, పెంటకోట శ్రీరాములు, పవర్ కిట్ట బాబు, దాడి పెదబుజ్జి, యల్లపు నానాజీ, పెనగంటి రాజేష్, నక్కా అప్పలరాజు,మద్దాల శ్రీను, పెంటకోట సాయి, సరిసే శివ, పెంటకోట వెంకన్న బాబు, ఆడారి సుధాకర్, పాముల చంటి, శరకణం సంతోష్, లంక మూర్తి, శరకణం తాతాజీ,నైదాన బాబ్జి, చిక్కాల కల్కిరామ్ అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన రొట్టె సతీష్

చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న చినపేట స్కూల్ కమిటీ చైర్మన్



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 22:ఆత్రేయపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు చోటుచేసుకున్నాయి. చినపేట స్కూల్ కమిటీ చైర్మన్ రొట్టె సతీష్ తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని వైఎస్సార్‌సీపీలో చేరారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి రొట్టె సతీష్‌ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, గతంలో అందించిన సంక్షేమ పాలన పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు.ఆత్రేయపురం ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ, ప్రజల నుంచి లభిస్తున్న మద్దతు పార్టీ బలోపేతానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. రొట్టె సతీష్ చేరికతో గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

పంచాయతీ ఎన్నికల వేళ.. గ్రామాల్లో రాజకీయ సందడి



కాజులూరి సిద్ధార్థరెడ్డి, శివారెడ్డి తదితరులు మద్దతు తెలుపుతూ ఎన్నికల బరిలో నిలిపారు. మరోవైపు టేకుమూడి పద్మకు బిళ్లకుర్తి కృష్ణారెడ్డి, కాదా బుజ్జిబాబు, చెరుకూరి నారాయణరాజు తదితరులు మద్దతు ప్రకటిస్తున్నట్లు పద్మ తెలిపారు.ఈ సందర్భంగా టేకుమూడి పద్మ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే తన ధ్యేయమని, సేవే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తనను సర్పంచ్‌గా గెలిపిస్తే పల్లిపాలెం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.మరో అభ్యర్థి పంపన నాగమణి మాట్లాడుతూ.. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో నెలకొన్న బస్సు సౌకర్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇద్దరు అభ్యర్థులు గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ప్రధాన అంశాలుగా ప్రచారం సాగిస్తుండటంతో పల్లిపాలెంలో ఎన్నికల వాతావరణం ఆసక్తికరంగా మారింది.

కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 22: కాజులూరు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో ఉప్పుమిల్లి, అయితపూడి, కుయ్యేరు మినహా మిగిలిన గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఉప్పుమిల్లి గ్రామ పంచాయతీలో గ్రామ పెద్దల సమక్షంలో యాళ్ల వెంకటరమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆమె భర్త శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. అలాగే అయితపూడి, కుయ్యేరు గ్రామ పంచాయతీల్లోనూ సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు ఆయా పార్టీల శ్రేణులు వెల్లడించాయి.ఇదిలా ఉండగా, పల్లిపాలెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవికి టేకుమూడి పద్మ, పంపన నాగమణి మధ్య ద్విముఖ పోటీ నెలకొంది. పంపన నాగమణికి వైసీపీ నాయకులు

ర్యాలి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామంలో నూతన రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

మెర్లవీధి, గుడిమేరక ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జెడ్పీటీసీ అభ్యర్థి గుడపాటి శ్రీనివాసు

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 22: ర్యాలి గ్రామ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఆత్రేయపురం జెడ్పీటీసీ అభ్యర్థి గుడపాటి శ్రీనివాసు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ర్యాలి గ్రామంలోని మెర్లవీధి, గుడిమేరక ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తూ ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ర్యాలి గ్రామంలో పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు కూటమి నాయకులు కృషి చేస్తారని హామీ ఇచ్చారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి మద్దూరి సంధ్యాదేవి, రామకృష్ణుడిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామంలో నూతన రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడతామని, మురుగునీటి సమస్య లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని ప్రతి వీధికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడమే కూటమి లక్ష్యమని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు నిరంతరం అందుబాటులో ఉంటారని గుడపాటి శ్రీనివాసు తెలిపారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు.

ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని గ్రామ అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

జగ్గంపేటలో ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 22: జగ్గంపేట సంతమార్కెట్ వెనుక సత్యవేణిపేట సత్తెమ్మతల్లి గుడి పక్కన పల్లిబోయిన వెంకటేశ్వర్లు గురుస్వామి 30వ మాలధారణ సందర్భంగా శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా శనివారం మధ్యాహ్నం పేటతుళ్లి, సాయంత్రం 6గంటలకు శ్రీఅయ్యప్పస్వామివారి లక్ష బిల్వార్చన పూజ, పడిపూజ మామిళ్లపల్లి రామకృష్ణ గురుస్వామి, మామిళ్లపల్లి అయ్యప్పశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా చేశారు. భారీ సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. పల్లిబోయిన వెంకటేశ్వర్లు, పుర్రంశెట్టి వీరబాబు గురుస్వాములు దగ్గరుండి పడిపూజ జరిపించారు. పూజ అనంతరం స్వాములకు పల్లిబోయిన బ్రదర్స్ పల్లిబోయిన రాజేష్, మణికంఠ, గంగ ఫల హారం ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు, భారీ సంఖ్యలో భక్తులు హాజరు కావడంతో సత్యవేణి పేట ప్రాంతమంతా అయ్యప్ప శరణు ఘోషతో పులకించింది.

కత్తిపూడి కూటమి సర్పంచ్ అభ్యర్థి వెన్నా పద్మావతి శివ....

- నామినేషన్‌కు పోటెత్తిన జనం....
- నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీపీ మేడిశెట్టి బాబీ....
- వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించిన గ్రామ ప్రజలు, మహిళలు....

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 22:- కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెన్నా పద్మావతి శివ నామినేషన్ కార్యక్రమం భారీ జనసందోహం నడుమ ఉత్సాహభరితంగా సాగింది. గ్రామ ప్రజలు, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావడంతో కత్తిపూడి జనసంద్రంగా మారింది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీపీ మేడిశెట్టి బాబీతో పాటు కూటమి ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. భారీ ర్యాలీగా తరలివచ్చిన మద్దతుదారుల మధ్య వెన్నా పద్మావతి శివ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా, 6వ వార్డు సభ్యుడిగా గాబు సుభాష్ నామినేషన్ సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అభ్యర్థికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్, ఓరుగంటి పూసలు, ఓరుగంటి గణేష్, సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, కీర్తి మురళి, గాబు శివ, గ్రంధి చక్రి తదితర నాయకులు వెన్నా పద్మావతి శివకు భారీ గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కత్తిపూడిలో కనిపించిన ప్రజా మద్దతుతో వెన్నా పద్మావతి శివ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే ధీమాను కూటమి నాయకులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కంచిబోయిన శ్రీను, రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్, తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, గ్రామ టీడీపీ అధ్యక్షులు కేళంగి జన, సాధనాల లక్ష్మీబాబు, జ్యోతుల శివ, రౌతు శివ, కోలా వెంకట్, ఆలపు సత్యనారాయణ, కొయ్యా రమణ, దేశిలంక వెంకటరమణ, కూసుమంచి సూర్యప్రకాష్,తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







కాజులూరులో రసవత్తర పోటీ.. సర్పంచ్ పీఠం కోసం హోరాహోరీ



కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 22: కాజులూరు గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. సర్పంచ్ పదవికి కూటమి తరపున యాళ్ల వెంకటరమణ, ప్రముఖ వ్యాపారవేత్త, జనసేన నాయకుడు వట్టూరి పట్టాభిరామయ్య మధ్య ద్విముఖ పోటీ నెలకొంది. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో గ్రామంలో ఎన్నికల సమీకరణాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మండలవ్యాప్తంగా కాజులూరు పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది.యాళ్ల వెంకటరమణ కూటమి ప్రభుత్వ హయాంలో సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం, పోలిశెట్టి చంద్రశేఖర్ ఆశీస్సులతో పాటు కూటమి నాయకుల సూచన మేరకు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన అభ్యర్థిత్వానికి మద్దతుగా మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, యాళ్ల కాసులు, నీటి సంఘం అధ్యక్షుడు యాళ్ల సత్యనారాయణ, కమిడి వీరబాబు, సలాది నానాజీ తదితరులు నిలిచినట్లు వెంకటరమణ తెలిపారు. ఇద్దరు అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో నిమగ్నం కావడంతో కాజులూరులో పంచాయతీ ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర ఆరోగ్యానికి దోహద పడతాయి....



మాజీ ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్...

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 22:- క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. కాకినాడ జిల్లా మండల కేంద్రమైన శంఖవరం ఎస్సీ పేటలో నూతనంగా నిర్మించిన వాలీబాల్ కోర్టును ఆయన ఆదివారం సాయంత్రం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎస్ సి పేట క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత సెల్ ఫోన్ చూస్తూ సమయమును వృధా చేసుకోకుండా క్రమశిక్షణతో కూడిన జీవితం అలవర్చుకోవాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందుకున్నట్లయితే మీ కుటుంబంతో పాటు మెరుగైన సమాజము ఏర్పడుతుందని అన్నారు. వాలీబాల్ కోర్టు నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించినందుకు స్థానిక యువత ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామం ఒండ్రేగుల హనుమాన్ దళ్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం.



శంఖవరం పెన్ పవర్ నవంబర్ 22:- హనుమాన్ దళ్ వారి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా శంఖవరం మండలంలోని ఒండ్రేగుల అనే గిరిజన గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. గిరిజన ప్రజల భక్తిశ్రద్ధలు, సమష్టి కృషితో ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నేడు అత్యంత వైభవంగా జరిగింది.మారుమూల గిరిజన గ్రామమైన ఒండ్రేగులలో ఈరోజు ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. వేద పండితులు వంశీ మంత్రోచ్ఛారణలు, సంప్రదాయ మంగళవాయిద్యాల, గిరిజన నృత్యాల నడుమ శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమాలు, కలశ స్థాపన, అభిషేకాలు ఘనంగా జరిగాయి. చుట్టుపక్కల గిరిజన తండాలు, గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ దళ్ అధ్యక్షులు గణేష్ కన్నా, కార్యదర్శి నేమాల వరహాలు, నందిబాబు, రామకృష్ణ, దుళ్ళ కృష్ణ, హనుమాన్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తులు, వార్డుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 22: కాకినాడ నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాల మేరకు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి ఎన్.వి.వి. సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో 66 వార్డులకు సంబంధించిన కార్పొరేటర్, మేయర్ స్థానాల ఎన్నికల బ్యాలెట్ పత్రాల పరిశీలన ప్రక్రియను అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్, రిటర్నింగ్ అధికారులతో కలిసి కమిషనర్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రతి వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లలో పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తులు, వార్డుల వివరాలు సక్రమంగా ముద్రించబడ్డాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.బ్యాలెట్ పేపర్లపై ముద్రించిన సీరియల్ నంబర్లను తనిఖీ చేయడంతో పాటు, ప్రింటింగ్ ప్రెస్ నుంచి అందిన బ్యాలెట్ పత్రాల సంఖ్యను సంబంధిత రికార్డులతో సరిపోల్చి ధ్రువీకరించాలన్నారు. ముద్రణ స్పష్టత, ఎన్నికల గుర్తుల కచ్చితత్వం, బ్యాలెట్ పేపర్ల నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. వరుస సంఖ్యల్లో పునరావృతాలు, గల్లంతైన సంఖ్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రతి వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను వేర్వేరుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని, పరిశీలనలో ఏవైనా లోపాలు లేదా వ్యత్యాసాలు గుర్తిస్తే వాటిని సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన బ్యాలెట్ పేపర్లను వార్డుల వారీగా నిర్దేశిత విధానాల ప్రకారం భద్రపరచాలని సూచించారు.
ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ప్రతి అధికారి తమకు అప్పగించిన విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, కచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల రిటర్నింగ్ అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడువారాల వెంకన్న సన్నిధిలో అష్టోత్తర పూజకు భక్తుల వెల్లువ



- తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం.. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన వాడపల్లి క్షేత్రం
- భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 22:కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధి ఆదివారం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఏడువారాల వెంకటేశ్వర స్వామిగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్న స్వామివారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏడువారాల నోము నోచుకున్న భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకుంటూ స్వామివారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఏడువారాల అనంతరం నిర్వహించే అష్టోత్తర పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.వేకువజాము నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమై రోజంతా కొనసాగింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరగా, ఏడువారాల మొక్కులు నెరవేర్చుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. కుటుంబ సమేతంగా క్షేత్రానికి చేరుకున్న భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏడువారాల నోము ఆచరణలో భాగంగా ఏడు వారాల పాటు స్వామివారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకుంటున్న భక్తులు, చివరి వారంలో నిర్వహించే అష్టోత్తర పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.
వాడపల్లి క్షేత్రం ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకోవడంతో పాటు ఏడువారాల వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడం విశేషంగా నిలుస్తోంది. స్వామివారిని దర్శించుకుని తమ కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ పెరిగినప్పటికీ దర్శన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు ఆలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం, పూజా కార్యక్రమాలు, ఇతర సౌకర్యాల విషయంలో తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధర్ రావు తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఆలయ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఏడువారాల వెంకన్న సన్నిధిలో అష్టోత్తర పూజా కార్యక్రమానికి భక్తుల విశేష స్పందన లభించడంతో ఆలయ పరిసరాలు భక్తి భావంతో నిండిపోయాయి. స్వామివారి దర్శనం, మొక్కుల సమర్పణ, పూజా కార్యక్రమాలతో వాడపల్లి క్షేత్రం ఆదివారం ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న ఏడువారాల వెంకటేశ్వర స్వామి వారి సన్నిధికి భవిష్యత్తులోనూ మరింత మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఆంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయం భక్తజన సందోహం తో కిటకిట లాడుతుంది



అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ఆంధ్ర శబరిమలై

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 22:- కాకినాడ జిల్లా శంఖవరం మండలం లోని సిద్ధివారిపాలెం గ్రామంలో కొలువై ఉన్నప్రముఖ పుణ్యక్షేత్రం ఆంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. కార్తీక మాస పవిత్ర దినాలు, అందులోనూ ఆదివారం కావడంతో తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అయ్యప్ప నామస్మరణలు, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆలయానికి విచ్చేసిన ప్రతి భక్తుడికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు (గురుస్వామి) ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు సజావుగా స్వామివారి దర్శనం కల్పించడంతో పాటు, వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాభిషేకం ముత్యాభిషేకం, పంచా మృతాభిషేకం వంటి విశేష అభిషేకాల్లో భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి కృపకు పాత్రులయ్యారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టశ్వర్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి మాట్లాడుతూ ఆంధ్ర శబరిమలైలో ఏడాది పొడవునా 365 రోజులు భక్తులకు అయ్యప్ప స్వామి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ స్వామివారిని దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరికీ స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులకు ఆధ్యాత్మిక సేవతో పాటు అన్నప్రసాద వితరణ అందించడం ఆలయ కమిటీ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప మాలధారులు, భక్తులందరికీ ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.స్వామివారి దర్శనం, విశేష అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలతో ఆంధ్ర శబరిమలైలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తి, సేవ, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తున్న ఆంధ్ర శబరిమలైలో భక్తుల రాకతో ఆలయ పరిసరాలు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఏటిమొగలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 22: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించేందుకు కాకినాడ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏటిమొగ ప్రాంతంలో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కవాతు చేపట్టారు.కాకినాడ డీఎస్పీ ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు ఆధ్వర్యంలో 3వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.వి.ఎస్. సత్యనారాయణ, పోర్టు పోలీస్ స్టేషన్ సీఐ పి. సునీల్ కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



జీలుగుమిల్లి ,పెన్ పవర్, నవంబరు 22::ముసరు తుఫాను వల్ల పంట దెబ్బతిని నష్టపోయిన అన్ని పంటల రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఆదివారం జీలుగుమిల్లి మండలంలోని వంకవారిగూడెం గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి ముసరు తుఫాను పంట నష్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దర్భగూడెం, వంకావారిగూడెం, అంకంపాలెం గ్రామాల పరిధిలో అశ్వారావుపేట వాగు ముంపు వల్ల వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోవడమే కాకుండా ఇసుక మేటలు వేయడం వల్ల తిరిగి పంటలు సాగు చేయలేని విధంగా పంట భూములు తయారయ్యాయని చెప్పారు. మండలంలో అనేక చెరువులకు భారీగా గండ్లు ఏర్పడ్డాయన్నారు. రోడ్లు పూర్తిగా పాడైపోయాయని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి వరద రావడంతో భారీ నష్టం జరిగిందన్నారు. వరి, వేరుశనగ, బొబ్బర, అరటి, ఆయిల్ ఫామ్, కూరగాయలు, మినుము తదితర పంటలకు నష్టం ఏర్పడిందని, నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.30వేలు, ఉద్యాన పంటలకు రూ. లక్ష నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట భూముల్లో ఏర్పడిన ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగించాలన్నారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందించాలని కోరారు. ప్రభుత్వ నష్టపరిహారాలు కోసం రైతుల పేర్లను నమోదు చేయడం తప్ప పరిహారం చెల్లించడంలో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. తక్షణమే పరిహారం చెల్లించేలా నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు దాసరి జానకిరామిరెడ్డి, మండల కార్యదర్శి సిరి బత్తుల సీతారామయ్య, సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు, తెల్లం సంకురుడు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



- ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలి
- సీఐ గజేంద్ర కుమార్

గంగవరం, పెన్ పవర్ నవంబర్ 22:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆదివారం గంగవరం గ్రామంలో గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్యతో కలిసి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం, గొడవలకు దిగడం, ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో నిబంధనలు పాటించాలని, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో అనుమానాస్పద కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అదేవిధంగా ప్రజల భద్రత దృష్ట్యా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించరాదని సూచించారు.

ఈ కార్యక్రమంలో గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య, ఏఎస్ఐ వీర్రాజు, హెడ్ కానిస్టేబుల్ ఇస్రాయిల్ రాజు , కానిస్టేబుల్ అరుణ్ కుమార్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నేరస్తులపై పోలీసుల ఉక్కుపాదం

- 25 మంబిపై డిటెన్షన్ ఆర్డర్లు
- 15 మంది అరెస్ట్ చేసి సెంట్రల్ జైలుకు తరలింపు
- గంజాయి అక్రమ రవాణాపై నిరంతర నిఘా
- జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి

రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ ,నవంబర్ 22:పోలవరం జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి తెలిపారు. గంజాయి నేరాలకు అలవాటు పడి పదేపదే అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జీఏడీ, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గంజాయి నేరాలకు పాల్పడుతున్న మొత్తం 25 మందిపై డిటెన్షన్ ఆర్డర్లు జారీ చేసినట్లు తెలిపారు. వీరిలో ఇప్పటివరకు 15 మందిని అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలించినట్లు వెల్లడించారు. మిగిలిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.జిల్లాలో గంజాయి అక్రమ సాగు, నిల్వ, రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని, ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తును నాశనం చేసుకునే వ్యసనాలకు అలవాటు పడవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా పోలీస్ అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో పోలీస్ శాఖ తన కార్యాచరణను మరింత పటిష్టంగా కొనసాగిస్తుందని ఎస్పీ కే. చక్రవర్తి స్పష్టం చేశారు.



గ్రామీణ ప్రజలకు పీఎంపీల ప్రాథమిక వైద్య సేవలే కీలకం



బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 22:గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీలు, బీఎంపీలు ప్రజా వైద్యులుగా గుర్తింపు పొందారని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న వీరికి ప్రభుత్వపరంగా తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు.ఆదివారం ఆర్ఎంపీ, బీఎంపీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సదుపాయాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు ఇప్పటికీ ఆర్ఎంపీలు, బీఎంపీల వద్దకు వెళుతున్నారన్నారు. ఆర్ఎంపీలు, బీఎంపీలకు తగిన పరీక్షలు నిర్వహించి, మూడు నాలుగు నెలల శిక్షణ అందించి, ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ద్వారా చట్టబద్ధమైన పరిధిలో గుర్తింపు కల్పించే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సంఘాల ప్రతినిధులు జేపీ నడ్డాను కలిశారని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆధునిక వైద్య పరీక్షల ప్రాధాన్యతను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో రోగులను నిపుణులైన వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. బిజెపి ఎపి ఇంఛార్జి అరవింద్ సింగ్ భదోరియా మాట్లాడుతూ మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీ దేవి తో పాటు కూటమి కార్పోరేటర్లను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం చేయడం బిజెపి ధ్యేయమన్నారు.

మండల కేంద్రానికి చేరిన ఎలక్షన్ మెటీరియల్



వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 22 : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్ మండల కేంద్రానికి చేరిందని స్ట్రాంగ్ రూములో భద్రపరచడం జరిగిందని ఎంపీడీవో కే. బాపన్న దొర తెలిపారు. మండలంలో 12 పంచాయతీలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఆదివారం చేరిందని ఎంపీడీవో కే. బాపన్న దొర తెలిపారు. మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచడానికి చామగడ్డ పిడిఓ సుధా ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ కరుణ, జూనియర్ అసిస్టెంట్ కృపవరం, యార్లగడ్డ, దేవరమడుగుల డీఏలు నవీన్, ప్రసాద్, క్లాప్ మిత్రులు సహకారం చేశారని ఎంపీడీవో తెలిపారు.

సత్య మాల దీక్ష భక్తులకు వస్త్రాలు,మాలలు పంపిణీ...

-సనాతన ధర్మ గొప్పతనాన్ని చాటాలని పిలుపు



కూనవరం,పెన్ పవర్,నవంబ ర్ 21.మండలంలో అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి సత్యమాల దీక్ష స్వీకరించిన సుమారు 200 మంది భక్తుల కు అన్నవరం దేవస్థానం,అడ్డ తీగల పవనగిరి స్వామిద్వారా సత్య దీక్ష వస్త్రాలు,మాలలు పంపిణీ చేశారు.సొత్నబోయి న రాధాకృష్ణ,రాధ,నోముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పాయం వెంకయ్య, టీడీపీ మండల కార్యదర్శి ఎడ వల్లి భాస్కరరావు,పోడియం అప్పారావు పాల్గొని భక్తులకు దీక్షా వస్త్రాలు,మాలలు అంద జేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం లో మాలను ధరించి దీక్షను ఆచరించి,ఎంతో నిష్ఠతోమాల యొక్క గొప్పతనాన్ని,మన సనాతన ధర్మం యొక్క గొప్ప తనాన్ని నలుదిక్కులా చాటా లని పిలుపునిచ్చారు.భక్తులు అందరూ దీక్షా నియమాలను పాటించి అన్నవరం సత్యనా రాయణ స్వామిని దర్శించు కోవాలని కోరారు.భక్తులు అన్నవరం దేవస్థానం,పవన గిరి స్వామి వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీతక్కపారి సునీత,భక్తులు పాల్గొన్నారు.

గోవిందగిరిపై నవంబర్ 24న కార్తీక దీపోత్సవం

- సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక దీపారాధన



గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, నవంబర్ 22:కార్తీక పౌర్ణమి సందర్భంగా రంపచోడవరం సమీపంలోని గోవిందగిరిపై కొలువై ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక దీపారాధన కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పార్థస్వామి, మణికంఠ స్వామి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి రోజున స్వామివారికి దీపారాధన చేయడం ఎంతో విశిష్టమైనదని తెలిపారు. ఈ పవిత్రమైన రోజున భక్తిశ్రద్ధలతో దీపం వెలిగించి స్వామివారిని ఆరాధించడం వల్ల ఏడాది పొడవునా దీపారాధన చేసిన పుణ్యఫలం లభిస్తుందని వివరించారు.కార్తీక మాసంలో దీపారాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్తీక దీపోత్సవంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ అధికారి అంచూరి శిరీష విజ్ఞప్తి చేశారు.ు

కత్తిపూడి ధర్మసత్రం వ్యవస్థాపకురాలు పెద్దాపురం మహారాణి బుచ్చి సీతాయమ్మ బహద్దర్ 191వ వర్ధంతి వేడుకలు...



శంఖవరం పెన్ పవర్ నవంబర్ 22:- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలోని శ్రీరాజా వత్సవాయి బుచ్చి సీతాయమ్మ మహారాణి బహద్దర్ 191వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్రం గ్రేడ్ 1 కార్యనిర్వహణ అధికారి రాపాక శ్రీనివాసరావు చేతులు మీదుగా జ్యోతీ ప్రజ్వలనం చేసి టెంకాయలు కొట్టి అమ్మ వారి దివ్య స్మృతికి కార్యక్రమ ఆహూతులు, సీనియర్ జర్నలిస్ట్ జక్కల నాగ సత్యనారాయణతో సహా హాజరైన శంఖవరం పాత్రికేయులు అందరూ అమ్మ వారి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె సేవలను విశేషంగా కొనియాడారు. అమ్మ వారి పేరు మీద నిరుపేదలకు శీతాకాలపు చలి నుంచి రక్షణ ఉపశమనానికి కొంత మంది నిరుపేదలకు ఆర్.వి.బి.యస్. సత్రం గ్రేడ్ 1 కార్యనిర్వహణాధికారి రాపాక శ్రీనివాసరావు చేతులు మీదుగా కాటన్ దుప్పట్లను పంపిణీ చేశారు. బాటసారులకు అన్నదానం చేయాలనే అమ్మవారి ప్రధాన ఆశయం మేరకు సత్రంలో అన్న సమారాధన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కోడ్ అమల్లో ఉన్న కారణంగా రాజకీయ, ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ మర్యాదలకు అతీతంగా అమ్మవారి 191వ వర్ధంతి వేడుకలను కాకినాడ సమీపంలోని సర్పవరంలో కొలువై ఉన్న భావ నారాయణ స్వామి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుల అత్యంత సహజసిద్ధమైన డోలు, సన్నాయిల మంగళవాయిద్యాల శుద్ధ సంగీత ధ్వనుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కెమెరా పట్టిన చేతులతోనే.. మండల పగ్గాలు!

- ఫోటోగ్రాఫర్ నుంచి ఎంపీపీ పీఠం వరకు..
- యువ నాయకుడు పూజారి లీలాప్రసాద్ ప్రస్థానం



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 22:పట్టుదల, ప్రజలతో మమేకమయ్యే మనస్తత్వం, సేవ చేయాలనే సంకల్పం ఉంటే సాధారణ స్థాయి నుంచి సైతం ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని నిరూపించారు గూడెంకొత్తవీధి మండలానికి చెందిన యువ నాయకుడు పూజారి లీలాప్రసాద్. నిన్నటి వరకు చేతిలో కెమెరా పట్టుకుని ఫోటోగ్రాఫర్‌గా అందరికీ సుపరిచితుడైన ఆయన.. నేడు అదే మండలానికి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి రాజకీయ ప్రస్థానంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన లీలాప్రసాద్ చిన్న వయసులోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. ఫోటోగ్రాఫర్‌గా తన వృత్తిని కొనసాగిస్తూనే ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకున్నారు. తన మృదుస్వభావం, కలుపుగోలుతనం, అందరితో ఆత్మీయంగా మెలిగే తత్వంతో స్థానికంగా గుర్తింపు సంపాదించుకున్నారు. క్రమంగా ప్రజాజీవితంలో చురుకైన పాత్ర పోషిస్తూ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా జీకే వీధి-1 ఎంపీటీసీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం జరిగిన ఎంపీపీ ఎన్నికల్లోనూ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకుని మండల పరిషత్‌కు నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. దీంతో ఒక సాధారణ ఫోటోగ్రాఫర్‌గా ప్రారంభమైన ఆయన ప్రయాణం మండల స్థాయి రాజకీయాల్లో కీలక పదవిని అధిరోహించే స్థాయికి చేరుకుంది.రాజకీయ నేపథ్యం కంటే ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం, తనపై ఉంచిన నమ్మకమే తన ఎదుగుదలకు ప్రధాన బలమని ఆయన ప్రస్థానం చాటిచెబుతోంది. వృత్తి జీవితంలో కెమెరా ద్వారా ఎన్నో జ్ఞాపకాలను చిత్రీకరించిన లీలాప్రసాద్.. ఇప్పుడు ప్రజాప్రతినిధిగా మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేయాల్సిన బాధ్యతను భుజాన వేసుకున్నారు.యువ వయసులోనే ఎంపీపీగా బాధ్యతలు చేపట్టడం మండల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. యువ నాయకత్వం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పాలనతో గూడెంకొత్తవీధి మండల అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒక సామాన్య ఫోటోగ్రాఫర్ నుంచి మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎదిగిన పూజారి లీలాప్రసాద్ ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

నన్ను గెలిపిస్తే ప్రజల మనిషిగా మీ తోడుంటా.అనిల్ పాంగి

- హుకుంపేట సర్పంచ్ గా పాంగి అనిల్ నామినేషన్ దాఖలు



హుకుంపేట పెన్ పవర్, నవంబర్ 22: హుకుంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి పాంగి అనిల్ నామినేషన్ దాఖలు చేశారు.కుటుంబ సభ్యులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆయన, ఎన్నికల అధికారి కు నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా పాంగి అనిల్ మాట్లాడుతూ, హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షుడిగా చేసిన అనుభవంతో, గ్రామ అభివృద్ధి, తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావించి సేవ చేస్తానని అయన అన్నారు.

నూతన ప్రజాప్రతినిధులను సత్కరించిన ప్రభుత్వ విప్.



గుమ్మలక్ష్మీపురం నవంబర్ 22 పెన్ పవర్.కురుపాం నియోజకవర్గం గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాడు గరుగుబిల్లి మండలానికి చెందిన నూతన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గరుగుబిల్లి మండల పరిషత్ అధ్యక్షులుగా(ఎంపీపీ)నూతనంగా బాధ్యతలు చేపట్టిన మరడాన నారాయణ స్వామి,ఉల్లిభద్ర గ్రామ నూతన సర్పంచ్ మరడాన వాసవికుమారితో పాటు,గరుగుబిల్లి మండలంలో కూటమి పార్టీల తరఫున పోటీ చేసి ఎంపీటీసీ సభ్యులుగా విజయం సాధించిన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేని కలిశారు.ఈ సందర్భంగా నూతన ఎంపీపీ,సర్పంచ్‌తో పాటు విజయం సాధించిన ఎంపీటీసీ సభ్యులందరినీ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శాలువాలతో ఘనంగా సత్కరించి,అభినందనలు తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటానికి సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి మండలానికి చెందిన కూటమి పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై వ్యాఖ్యలను ఖండించిన జర్రెల వైసీపీ శ్రేణులు

- బొబ్బిలి లక్ష్మణ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 23: స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై బొబ్బిలి లక్ష్మణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను జర్రెల పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలోని వైసీపీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా సమావేశమై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవలో నిరంతరం ముందుండే ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుపై వ్యక్తిగత విమర్శలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించబోమని తెలిపారు. బొబ్బిలి లక్ష్మణ్ తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నూతన ఎంపీటీసీ మొట్టడం రాజమణితో పాటు జర్రెల పంచాయతీ వైసీపీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గొలుసు గుర్తుతో దూసుకుపోతున్న వరహాలమ్మ .



కూటమి అభ్యర్థిగా మేజర్ పంచాయతీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం.

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 22.చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో కూటమి పార్టీ బలపరిచిన అభ్యర్థినిగా పోటీ చేస్తున్న రీమల వరహాలమ్మ ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీనియర్ నాయకుడు, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు సతీమణిగా రాజకీయ నేపథ్యం కలిగిన ఆమె, ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి మేజర్ పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనకు కేటాయించిన గొలుసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొంటూ ఆమెకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో సాగుతున్న ప్రచారంతో వరహాలమ్మ ఎన్నికల బరిలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. మేజర్ పంచాయతీ ఓటర్ల ఆదరాభిమానాలతో సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలనే లక్ష్యంతో ఆమె ఓటర్ల మద్దతు కోరుతున్నారు.

బాబీ విజయానికి ఎంపీపీ లీలాప్రసాద్ ప్రచారం

పనసపల్లిలో ఇంటింటి ప్రచారం.. ఓటర్లను కలిసి మద్దతు కోరిన ఎంపీపీ



గూడెంకొత్తవీధి, పెన్ పవర్,నవంబర్ 22: జీకేవీధి పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థి కొర్ర బాబీకి మద్దతుగా మండల ఎంపీపీ పూజారి లీలాప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పనసపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ కొర్ర బాబీకి మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన ఎంపీపీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సేవలందిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ అభ్యర్థి కొర్ర బాబీ విజయానికి ఓటర్లు సహకరించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాక్సైట్ తవ్వకాలకు సిద్ధమైన ప్రభుత్వ యంత్రాంగం.



- పంచాయతీ ఎన్నికల అనంతరం తవ్వకాలకు సమాయత్తం.
- గిరిజనులు ఇప్పటికైనా సంఘటితమై పోరాడి నిక్షేపాలను కాపాడుకోవాలి.
- బోనంగి చిన్నయ్య పడాల్

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 22 . ప్రభుత్వ ఆదాయం కోసం ఏజెన్సీ ప్రాంతంలోని సహజ సంపదను కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని సీపీఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఆరోపించారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే బాక్సైట్ తవ్వకాలకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చౌడుపల్లి పంచాయతీ సీపీఎం సర్పంచ్ అభ్యర్థి సాగిన చిరంజీవి, మండల కమిటీ సభ్యుడు కిల్లో సింహాచలంతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గనుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో 2027-28 ఆర్థిక సంవత్సరానికి 12.29 మిలియన్ టన్నుల బాక్సైట్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రతిపాదనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. దీనిద్వారా ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో తవ్వకాలకు సంబంధించిన కదలికలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. బాక్సైట్ తవ్వకాలతో ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ సంపద, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా జలవనరులపైనా తీవ్ర ప్రభావం పడుతుందని చిన్నయ్య పడాల్ ఆందోళన వ్యక్తం చేశారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంతోపాటు శారద, వరాహ, తాండవ, పెద్దేరు జలాశయాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. దీని ప్రభావం ఏజెన్సీకే పరిమితం కాకుండా నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, మాడుగుల తదితర మైదాన ప్రాంతాల రైతులపైనా పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికయ్యే సర్పంచులు తవ్వకాలకు వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానాలు చేయాలని, పెసా చట్టం పరిధిలో గ్రామసభలు నిర్వహించి వ్యతిరేక తీర్మానాలు ఆమోదించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఆదివాసీ గిరిజనులంతా సంఘటితమై తమ ప్రాంతాల పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చౌడుపల్లి సర్పంచ్ అభ్యర్థి సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం, అప్పలస్వామి, చంటి పాల్గొన్నారు.

ఆర్భాటాలకు దూరంగా.. అభివృద్ధే లక్ష్యంగా గోవిందరావు ప్రచారం!



ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన సంకాడ సర్పంచ్ అభ్యర్థి

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 22: సంకాడ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి దేశగిరి గోవిందరావు తెలిపారు. ఆదివారం ఆయన పంచాయతీ పరిధిలో ఎటువంటి ఆర్భాటాలు, హంగులు లేకుండా నిరాడంబరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలను నేరుగా కలుసుకుని తనకు మద్దతు తెలిపి ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఆర్భాటపు ప్రచారానికి దూరంగా ప్రజలతో మమేకమవుతూ సాగించిన గోవిందరావు ప్రచారం స్థానికంగా చర్చనీయాంశమైంది.

పంచాయతీ ప్రగతే లక్ష్యం.. సర్పంచ్ బరిలో కాకూరి వెంకటరమణ!

- గూడెంవీధి పంచాయతీ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 22:గూడెంకొత్తవీధి పంచాయతీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చేందుకే తాను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచినట్లు కాకూరి వెంకటరమణ తెలిపారు. ఆదివారం పంచాయతీ పరిధిలోని పలు మారుమూల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో అభివృద్ధి, మార్పు లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. తనకు ఒక్క అవకాశం కల్పించి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు.

వెన్నంటి నిలిచి నడిపించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- క్యారెట్ గుర్తు విజయానికి కలిసికట్టుగా కృషి చేయండి.
- ప్రచారంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వైసీపీ సర్పంచ్ అభ్యర్థి పుష్పలత విజ్ఞప్తి.



చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 22 .చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి, పార్టీ ఐక్యత కోసం స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకున్న నాయకులకు వైకాపా అభ్యర్థి, తాజా మాజీ సర్పంచ్ దురియా పుష్పలత కృతజ్ఞతలు తెలిపారు. పార్టీపై అభిమానం, గౌరవంతో వ్యక్తిగత పోటీకి స్వస్తి పలికి తనకు మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. వైకాపా సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పోతురాజు బాలయ్య సతీమణి దేవుడమ్మ, కవడం కాసులమ్మ తనకు మద్దతుగా నిలవడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పోటీ నుంచి తప్పుకుని ఐక్యతకు ప్రాధాన్యమివ్వడం పార్టీ శ్రేణుల్లో సానుకూల వాతావరణానికి దోహదపడిందన్నారు. అలాగే పార్టీ నాయకుల మధ్య సమన్వయం సాధించి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడంలో కృషి చేసిన వైకాపా గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, పంచాయతీ అధ్యక్షుడు సాగిన గంగన్నపడాల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు తనకు కేటాయించిన క్యారెట్ గుర్తును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పుష్పలత కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషిచేసి క్యారెట్ గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తనపై నమ్మకంతో అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరి ఆదరాభిమానాలను నిలబెట్టుకుంటానని ఆమె పేర్కొన్నారు.

దోహాలో భారత్ ఎ, పాక్ ఎ జట్ల సమరం..

టాస్ సమయంలో గందరగోళం..

- దోహాలో ఏసీసీ పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నమెంట్
- భారత్ ఎ, పాక్ ఎ జట్ల మ్యాచ్
- టాస్ ఫలితం ప్రకటనలో మ్యాచ్ రిఫరీ పొరపాటు
- వెంటనే స్పందించి రిఫరీ దృష్టికి తీసుకెళ్లిన అబ్దుల్ సమద్
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ ఎ
- టాస్ ఫలితంపై సంతృప్తి వ్యక్తం చేసిన తిలక్ వర్మ



ఏసీసీ పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నమెంట్‌లో భాగంగా భారత్ ‘ఎ’, పాకిస్థాన్ ‘ఎ’ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ సందర్భంగా ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. దోహా వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ వేసిన సమయంలో మ్యాచ్ రిఫరీ చేసిన చిన్న పొరపాటు కాసేపు అయోమయానికి దారితీసింది.టాస్ సందర్భంగా మ్యాచ్ రిఫరీ ఫలితాన్ని తప్పుగా ప్రకటించాడు. అయితే అక్కడే ఉన్న పాకిస్థాన్ ‘ఎ’ జట్టు కెప్టెన్ అబ్దుల్ సమద్ ఈ విషయాన్ని వెంటనే గమనించాడు. అతడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా నాణెం వద్దకు వెళ్లి పరిశీలించాడు. టాస్ నిర్ణయాన్ని మరోసారి సరిచూసుకోవాల్సిందిగా రిఫరీని కోరాడు. పాక్ సారథి విజ్ఞప్తితో రిఫరీ పరిస్థితిని పునఃపరిశీలించి, తన ప్రకటనను సరిదిద్దుకున్నాడు. దీంతో పాకిస్థాన్ ‘ఎ’ జట్టు టాస్ గెలిచినట్లు అధికారికంగా ధ్రువీకరించారు.

టాస్ గెలిచిన అనంతరం పాకిస్థాన్ ‘ఎ’ కెప్టెన్ అబ్దుల్ సమద్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పిచ్ పొడిగా ఉందని, తొలుత బ్యాటింగ్ చేయడం ద్వారా తమ జట్టుకు మంచి ప్రయోజనం కలుగుతుందని అతడు పేర్కొన్నాడు. తమ జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని తెలిపాడు. మరోవైపు భారత్ ‘ఎ’ కెప్టెన్ తిలక్ వర్మ స్పందిస్తూ.. తాము కూడా టాస్ గెలిస్తే బ్యాటింగ్ చేయాలనే భావించామని, అయితే ప్రత్యర్థిని ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించడం పట్ల తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశాడు.ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఇరు జట్ల వివరాలను పరిశీలిస్తే.. తిలక్ వర్మ నేతృత్వంలోని భారత్ ‘ఎ’ జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్, హర్షిత్ రాణా వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అబ్దుల్ సమద్ సారథ్యంలోని పాకిస్థాన్ ‘ఎ’ జట్టులో మాజ్ సదాకత్, రోహైల్ నజీర్, హసన్ నవాజ్ తదితరులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టాస్ సమయంలో అబ్దుల్ సమద్ సమయస్ఫూర్తితో వ్యవహరించి రిఫరీ దృష్టికి తీసుకెళ్లడంతో మ్యాచ్ ఆరంభానికి ముందే సరైన నిర్ణయం ఖరారైంది.

వెల్లింగ్టన్‌లో పంత్ సెంచరీకి గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్..

న్యూజిలాండ్‌తో టెస్టులో రిషభ్ పంత్ తొమ్మిదో సెంచరీ
సిక్సర్‌తో శతకం పూర్తి.. స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చిన గవాస్కర్
సెనా దేశాల్లో సెంచరీ చేసిన తొలి ఆసియా వికెట్ కీపర్‌గా రికార్డు
అత్యధిక టెస్టు శతకాలు బాదిన కీపర్ల జాబితాలో మూడో స్థానం



టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరోసారి తనదైన శైలిలో చెలరేగిపోయాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న టెస్టు మ్యాచ్ నాలుగో రోజు పంత్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఇది అతనికి టెస్టుల్లో తొమ్మిదో శతకం. ఈ సెంచరీతో పంత్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నింగ్స్‌లో భాగంగా గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో మిడ్-ఆఫ్ మీదుగా అద్భుతమైన సిక్సర్ బాది పంత్ తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో కామెంటరీ బాక్సులో ఉన్న భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్, పంత్ షాట్‌కు ముగ్ధుడై తన సీటులో నుంచి లేచి నిలబడి చప్పట్లతో అభినందించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ పంచుకుంది.

అరుదైన రికార్డులు బద్దలు!

ఈ సెంచరీతో టెస్టుల్లో అత్యధిక శతకాలు సాధించిన వికెట్ కీపర్ల జాబితాలో పంత్ మూడో స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లండ్‌కు చెందిన లెస్ అమెస్ (8 సెంచరీలు)ను అతను అధిగమించాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ (17), జింబాబ్వే ఆటగాడు ఆండీ ఫ్లవర్ (12) మాత్రమే పంత్ కన్నా ముందున్నారు. అంతేకాకుండా ‘సెనా’ దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా నాలుగింటిలోనూ టెస్టు సెంచరీ చేసిన తొలి ఆసియా వికెట్ కీపర్‌గా పంత్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన మూడో వికెట్ కీపర్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో పంత్ చేసిన శతకం, న్యూజిలాండ్‌పై భారత్ పట్టును మరింత బిగించేందుకు దోహదపడింది.

4 బంతుల్లో 4 వికెట్లు.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జంషెడ్ ఆలం సంచలనం



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఎలైట్ 2026 టోర్నీలో క్రికెట్ అభిమానులు ఊపిరి బిగబట్టే అద్భుతం చోటు చేసుకుంది. సౌరాష్ట్రతో జరిగిన కీలక పోరులో రైల్వేస్ యువ పేసర్ జంషెడ్ ఆలం బంతితో నిప్పులు చెరుగుతూ వరుసగా 4 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు. మ్యాచ్‌లో మొత్తంగా 38 పరుగులు ఇచ్చి 5 వికెట్లు కూల్చిన ఈ 23 ఏళ్ల పేసర్, సౌరాష్ట్రను 153/8 స్కోరుకే కట్టడి చేసి రైల్వేస్‌కు 29 పరుగుల ఉత్కంఠ విజయాన్ని అందించాడు.

నాలుగు బంతుల్లో నలుగురు ఔట్:

రైల్వేస్ నిర్దేశించిన 183 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌరాష్ట్రకు ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లోనే జంషెడ్ ఆలం కోలుకోలేని దెబ్బ కొట్టాడు.

వరుసగా 4 వికెట్లు: ఆ ఓవర్లో ముందుగా హర్విక్ దేశాయ్‌ను పెవిలియన్‌కు పంపిన ఆలం, ఆ తర్వాతి మూడు బంతుల్లో వరుసగా ప్రేరక్ మాంకడ్, రుచిత్ అహిర్, సమ్మర్ గజ్జర్లను ఔట్ చేసి అరుదైన డబుల్ హ్యాట్రిక్ పూర్తి చేశాడు.

మిథున్, నల్కండే సరసన రికార్డు: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన మూడో బౌలర్ గా జంషెడ్ ఆలం చరిత్ర సృష్టించాడు. గతంలో అభిమన్యు మిథున్, దర్శన్ నల్కండే మాత్రమే ఈ అరుదైన ఘనత సాధించారు.

ఆకట్టుకున్న ఖ-19 ఆసియా కప్ హీరో:

ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర ఓటమి పాలైనప్పటికీ, అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన మొహిత్ ఉల్వా) తన ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. తొలుత బౌలింగ్‌లో 4 ఓవర్లలో 38 పరుగులిచ్చి 2 వికెట్లు తీసిన మొహిత్, లక్ష్య ఛేదనలోనూ కేవలం 15 బంతుల్లో 22 రన్స్ చేసి జట్టును గెలిపించేందుకు పోరాడాడు. కానీ, జంషెడ్ ఆలం ఐదు వికెట్ల ధాటికి సౌరాష్ట్ర 153/8 స్కోరుకే పరిమితం కావడంతో మొహిత్ పోరాటం వృథా అయింది.

హనుమాన్-2.. తేలిగ్గా తీసుకోలేం

2024 సంక్రాంతికి రిలీజైన ‘హనుమాన్’ సినిమా ఎంతటి సంచలనం రేపిందో తెలిసిందే. పోటీలో ‘గుంటూరు కారం’ లాంటి పెద్ద సినిమా ఉండగా.. స్టార్ కాస్ట్ లేని ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ప్రభంజనం సృష్టించింది. తెలుగులోనే కాక ఇతర భాషల్లోనూ భారీ వసూళ్లు రాబట్టి పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. ఈ సినిమాకు కొనసాగింపుగా ‘జై హనుమాన్’ ఉంటుందని ఆ చిత్రం చివర్లో లీడ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆటోమేటిగ్గా ఈ సినిమాను ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ బేనర్లోనే ప్రశాంత్ తీస్తాడని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బేనర్లో చేయడానికి రెడీ అయిపోయాడు ప్రశాంత్. నిర్మాతలతో తనకు ఏం సమస్యో తెలియదు కానీ.. అతనో చిన్న దర్శకుడిగా ఉండగా నమ్మి స్టార్ కాస్టింగ్ లేకపోయినా మంచి క్వాలిటీతో సినిమాను ప్రొడ్యూస్ చేసిన నిర్మాతలను వదిలేశాడేంటి అనే ప్రశ్న తలెత్తింది. కానీ తెర వెనుక ఏం జరిగిందో తెలియదు కాబట్టి ప్రశాంత్‌ను కూడా తప్పుబట్టలేం. ఐతే ఈ విషయాన్ని ‘హనుమాన్’ ప్రొడ్యూసర్లు అంత తేలిగ్గా తీసుకోలేదని ఈ రోజే అర్థమైటంది. పంతం పట్టి తమ బేనర్లో ప్రత్యేకంగా ‘హనుమాన్’ సీక్వెల్‌ను అనౌన్స్ చేశారు. ఐతే ‘హనుమాన్’ సీక్వెల్ అంటే ప్రశాంత్ చేయడమే కరెక్ట్ అనే భావన ఉంటుంది ప్రేక్షకుల్లో. పైగా ‘కాంతార’ హీరో రిషబ్ శెట్టి అందులో లీడ్ రోల్ చేస్తుండడం, మైత్రి లాంటి పెద్ద సినిమా ప్రొడ్యూస్ చేస్తుండడంతో దానికి ఉన్న హైపే వేరు. ఈ నేపథ్యంలో ప్రొడ్యూసర్లు వేరుగా ‘హనుమాన్’ సీక్వెల్ అంటే ఆడియన్స్ లైట్ తీసుకుంటారనే భావిస్తాం. కానీ మెగా ఫ్యామిలీకి చెందిన పంజా వైష్ణవ్ తేజ్ ఇందులో హీరోగా నటిస్తున్నాడు. పైగా వైవిధ్యమైన సినిమాలకు పెట్టింది పేరైన వీఐ ఆనంద్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నాడు. ప్రైమ్ షో వాళ్లు కూడా ఈ సినిమాను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీ బడ్జెట్ పెట్టడానికి రెడీ అయిపోయారు. కాబట్టి ఈ ప్రాజెక్టును తేలిగ్గా ఏమీ తీసుకోలేం. మొత్తానికి ‘హనుమాన్’కు ఒకే టైంలో రెండు సీక్వెల్స్ తెరకెక్కడం, రెండూ ఆసక్తి రేకెత్తిస్తుండడం విశేషంగానే చెప్పుకోవాలి.





లైమ్ గ్రీన్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న రాయ్ లక్ష్మి

అందమైన ఐవరీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తున్న జాన్వీ కపూర్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com